క్లుప్తంగా

పంప్ హౌస్ పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో తాగునీరు సరఫరా చేసే గంజిళ్ల రోడ్డులోని పంప్‌హౌస్‌ను బుధవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. ప్రజలు ఇబ్బంది లేకుండా సమయానికి మంచినీటి సరఫరా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా శ్రీనివాస సర్కిల్‌లో ఉన్న అన్నక్యాంటీన్‌లో అల్పాహారం, భోజన పంపిణీపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

తాళిబొట్టు, కాలిమెట్టెల అందజేత



వధువు తల్లికి కాలిమెట్లు, తాళిబొట్టును అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: మండలంలోని కపటి గ్రామంలో హరిజన వేర్నికమ్మ కుమార్తె వివాహానికి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సాయం అందించారు. బుధవారం తన స్వగృహంలో వధువు తల్లి వేర్నికమ్మకు తాళిబొట్టు, కాలిమెట్టెలను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వివాహాలు నిర్వహించుకునే పేద కుటుంబాల ప్రజలకు తమవంతుగా తాళిబొట్టు, కాలిమెట్టెలు అందజేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పేదలకు అండగా ఉంటానని, తనవంతు సాయం అందిస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈడిగ చంద్రశేఖర్, దేవదాసు, భాస్కర్, జానేష్, కైపాల్ తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకోని వల్లూరు సచివాలయం



వల్లూరులో మూతపడ్డ సచివాలయం

కౌతాళం: మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో సచివాలయం మూడు రోజుల నుంచి తాళం వేసే ఉందని సచివాలయానికి సిబ్బంది ఎవరూ రావడం లేదని సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య తెలిపారు. బియ్యం కార్డుల్లో చేర్పులు, మార్పులు ఇతరాత్ర పనుల కోసం ప్రజలు సచివాలయం చుట్టూ తిరుగుతున్నా వారికి సమాధానం చెప్పే వారు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సచివాలయ సిబ్బందిపై అజమాయిషీ ఎవరో తెలియక ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థం కావడం లేదన్నారు. అధికారులు స్పందించి వల్లూరు సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.


రైతులకు నాణ్యతలేని వేరుశనగ కాయలు

ఆదోని రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగకాయల్లో నాణ్యత లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిమ్మయ్య అన్నారు. బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట వారు ధర్నా చేపట్టారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వేరుశనగకాయలను పరిశీలిస్తే నాణ్యతగా లేవని, వాటిని విత్తినా మొలకలు వచ్చే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ, కౌలు రైతు సంఘం నాయకులు మదిరె ఎల్లప్ప, కరెంట్ ఈరన్న, వడ్డే సత్యనారాయణ, మారెన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి

ఎమ్మిగనూరురూరల్: రైతులు వ్యవసాయంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నూతన సాంకేతిక పద్ధతులను అవలంబించాలని శాస్త్రవేత్త డాక్టర్ సింగప్ప, ఏడీఏ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కె.తిమ్మాపురం గ్రామంలో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్తలు మౌనిక, గణేష్, తేజ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఐరన్‌బండలో సర్పాల సయ్యాట



గోనెగండ్ల: మండల పరిధిలోని ఐరన్ బండ గ్రామంలో బుధవారం మధ్యాహ్నం ఎన్నెకండ్లకు వెళ్లే దారిలో రెండు పాములు సయ్యాటలాడాయి. దాదాపు గంట పాటు రెండు పాములు సయ్యాట ఆడటంతో గ్రామస్తులు చూసేందుకు తరలివెళ్లారు. సయ్యాట దృశ్యాలను గ్రామస్తులు, యువకులు తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు.

అన్ని వర్గాల ప్రజలకు కూటమి వెన్నుపోటు

- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్
- ఆదోనిలో 'వెన్నుపోటు దినం' విజయవంతం
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, మహిళలు, యువత
- వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ
- సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన, కార్యాలయ అధికారికి వినతిపత్రం

ఆదోని టౌన్: అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను వెన్నుపోటు పొడిచిందని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం ఆదోని పట్టణంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ఎస్కేడీ కాలనీ 1వ రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రకాంత్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు దేవా ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయం అధికారి, డిప్యూటీ తహసీల్దార్ వినీత్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు





ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుల నిరసన, మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదన్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

హామీల అమలులో విఫలం

ఎన్నికల ముందు సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 143 హామీలు, సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించిందన్నారు. ప్రభుత్వ తీరుతో రాష్ట్రంలో అన్నివర్గాలు విసిగిపోయాయన్నారు. మహిళలు, రైతులు, నిరుద్యోగులు ప్రతిఒక్కరూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అన్నివర్గాలు తిరోగమనం, స్కూళ్లు, ఆసుపత్రులు, పేదల సేవలకు దూరమయ్యాయన్నారు. తొలి ఏడాదిలోనే ఏకంగా రూ.15 వేల కోట్లు కరెంట్ బిల్లులు పెంచి రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం షాక్ ఇచ్చిందన్నారు. ఏడాది కాలంలో రూ.1.50 లక్షల కోట్లు అప్పు, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడంతో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించిపోయాయని ఆరోపించారు. మహిళలు, బాలికలకు రక్షణ కరువయ్యిందన్నారు.

కూటమి అరాచకాలపై ప్రజలకు అవగాహన

కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని ఎమ్మెల్సీ మధుసూదన్ తెలిపారు. కూటమి అరాచకాలను ఎండగట్టేందుకే జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినంగా జరుపుకోవడం జరుగుతోందన్నారు. రాష్ట్రమంతా ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహిస్తూ ఎక్కడికక్కడ ఉన్నతాధికారులకు వినతి పత్రాలను అందజేశామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి, పార్టీ శ్రేణులు వేణు, తాయన్న, దానం, రామాంజనేయులు, కుంకనూరు వీరేష్, వై.పి.గంగాధర్, రఘునాథ్‌రెడ్డి, ఈరన్న, సందీప్‌రెడ్డి, కిషోర్, వెంకటేశ్వర్‌రెడ్డి, అమాన్, మహిళా నాయకురాళ్లు మంజుల, లక్ష్మి, జిలేకాబీ, కల్పవల్లి, నాగరాజ్, కామాక్షి తిమ్మప్ప, గుంటెప్ప తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి దగా చేసిన కూటమి సర్కారు



వైఎస్సార్‌సీపీ నాయకుల భారీ ర్యాలీ

- గద్దెనెక్కి ఏడాదైనా అమలు చేయని హామీలు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక
- ఎమ్మిగనూరులో 'వెన్నుపోటు' దినం
- పార్టీ శ్రేణుల భారీ ర్యాలీ

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల ముందు హామీలతో ప్రజలను నమ్మించి అధికారం చేపట్టిన కూటమి సర్కారు ఏడాది అయినా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక ఆరోపించారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలతో పాటు మోసపూరిత వాగ్దానాలిచ్చి ఏడాదైనా వాటిని అమలు చేయకపోవడంతో బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక శిల్పా ఎస్టేట్‌లోని పార్టీ కార్యాలయం నుంచి వైఎస్సార్ సర్కిల్ మీదుగా రెవెన్యూ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులతో ర్యాలీ చేపట్టారు. అంతకు మునుపు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ వీరశైవలింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రగౌడ్, పార్టీ యూత్‌విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టాప్రతూల్, బుట్టా శివనీలకంఠ, యూత్‌నాయకుడు ఎర్రకోట రాజీవ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు తదితరులతో దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రగౌడ్‌కు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై వినతిపత్రం ఇచ్చారు.

ఏడాది పాలనలో చేసిందేమీలేదు

ఏడాది పాలనలో రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఏమి లేదని, సంక్షేమ పథకాలు లేవని బుట్టా రేణుక అన్నారు. ఏడాదిలో రూ.1.37లక్షల కోట్లు అప్పు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినా పేదలకు ఒనగూరే సంక్షేమం ఏమి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెన్షన్ పెంచడం, ఉచిత గ్యాస్ తప్ప ఏమి చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పింఛన్లను తొలగించారన్నారు. తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, రైతు భరోసా, ఉచిత బస్సు వాటిలో ఏవీ అమలు చేయలేదని, అదేవిధంగా ఆరోగ్యశ్రీని అటకెక్కించారన్నారు.



డీటీ వీరభద్రగౌడ్‌కు వినతిపత్రమిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు

ఏడాదిలో హామీలు అమలు చేసిన జగనన్న

వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలు ఏడాదిలో అమలు చేసిన ఘనత మాజీ సీఎం జగనన్నకే దక్కిందని బుట్టా రేణుక అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కరోనా వచ్చినా సంక్షేమ పథకాలెక్కడా నిలిపి వేయలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాల పార్టీ కన్వీనర్లు బీఆర్ బసిరెడ్డి, కేవీ కృష్ణారెడ్డి, శివప్పగౌడ్, పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, పార్టీ రాష్ట్ర నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, విరుపాక్షిరెడ్డి, మాచాని వెంకటేష్, ఎంపీపీ కేశన్న, సునీల్‌కుమార్, రియాజ్ అహమ్మద్, సోగ నూరు భీమిరెడ్డి, బందెనవాజ్, బుట్టారంగయ్య, మన్సూర్, లతారెడ్డి, విశ్వనాథ్, బజారి, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మోసానికి కేరాఫ్ చంద్రబాబు

- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి
- తప్పుడు కేసులతో భయపెట్టలేరు
- అక్రమ కేసులు నమోదు చేస్తే పోలీస్ స్టేషన్లను ముట్టడిస్తాం
- మంత్రాలయంలో 'వెన్నుపోటు దినం'



ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మంత్రాలయం : ఆనాడు అధికారం కోసం చంద్రబాబు పిల్లనిచ్చిన మామనే వెన్నుపోటు పొడిచాడని, నేడు అదే అధికారం కోసం లేనిపోని హామీలు గుప్పించి రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచాడని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి విమర్శించారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో «వెన్నుపోటు దినం» ఆందోళన చేపట్టారు. స్థానిక అబొడె హోటల్ నుంచి రాఘవేంద్ర సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. సర్కిల్‌లో దివంగత ముఖ్యమంత్రి విగ్రహానికి గజమాల వేసి జోహార్లు అర్పించారు. అనంతరం అదే సర్కిల్‌లో చంద్రబాబు వెన్నుపోటుపై ప్రసంగించారు. వెన్నుపోటు పొడవటం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య అని ఆరోపించారు. అధికారం కోసం దేనికైనా తెగిస్తారని విమర్శించారు. సూపర్ సిక్స్ పేరుతో ఆచరణకు సాధ్యం హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. ఏడాది పాలన పూర్తయినా పింఛన్లు, గ్యాస్ సిండర్ల హామీ తప్ప ఇతర ఏహామీలు నెరవేర్చలేదన్నారు. కేవలం పోలవరం, అమరావతి జపంతో పాలన సాగిస్తున్నారని వ్యక్తం చేశారు. ఆయనకు రాష్ట్ర ప్రజల సంక్షేమం కన్నా అమరావతిలో రియల్ ఎస్టేట్ మిన్నగా మారిందన్నారు.

తప్పుడు కేసులకు భయపడం

అధికారులు పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి తమ పార్టీ వర్గీయులపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. తప్పుడు కేసు పెట్టడంతో కోసిగి మండలం చిన్నభూంపల్లికి చెందిన చిన్న ఉసేని పోలీసుల వేధింపులు భరించలేక గుండెపోటు మృత్యువాత పడ్డాడన్నారు. ఇలాగే తప్పుడు కేసులు బనాయిస్తే స్టేషన్లను సైతం ముట్టడిస్తామని హెచ్చరించారు. అత్యుత్సాహం ప్రదర్శించే ఏ అధికారిని మరిపోమన్నారు. ప్రొటోకాల్ విషయంలో పోలీసులు తప్పుడు మార్గంలో పోతున్నారని గుర్తు చేశారు. తన నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జ్‌కు ఎస్‌ఐలు సైతం ప్రొటోకాల్ పాటించడం సరికాదన్నారు. నేను అనుకుంటే ప్రొటోకాల్ విషయంలో మీపై కేసులు పెట్టే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు పరిధులకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు.

హామీలు నెరవేర్చేంత వరకు పోరాటం

చంద్రబాబు సూపర్-6 హామీలు ఆనాడు జనసేన, బీజేపీ నేతలు వంత పాడాయని ఎమ్మెల్యే అన్నారు. నిసిగ్గుగా చంద్రబాబు హామీలు ఇచ్చినా ఆ పార్టీలకు పట్టలేదన్నారు. వెన్నుపోటు పొడిచినా మూడు పార్టీలకు ప్రజలు గుణపాఠం తప్పదన్నారు. చంద్రబాబు సూపర్-6 హామీలు నెరవేర్చేంత వరకు పోరాటాలు చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవకు కేంద్రం ఇచ్చే 6 వేలతో కలిపి ఏటా తమ ప్రభుత్వం రూ.26 వేలు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఏడాది కాలయాపన చేసిన చంద్రబాబు రెండేళ్లకుగానూ ప్రతి రైతులకు రూ.40 వేలు అప్పుపడ్డారని చెప్పారు. ఇంటింటికి రేషన్ వాహనాలను రద్దు చేసి తమ పార్టీ డీలర్ల సొంత లాభానికి తలుపులు తెరిచారని ఆరోపించారు. ఇప్పటికే చంద్రబాబు పాలనపై విమర్శలు ఊరూర వెల్లువెత్తున్నట్లు చెప్పుకొచ్చారు. అనంతరం రాఘవేంద్ర సర్కిల్ మీదుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. అక్కడ ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్ రవికి డిమాండ్ల కూడిన వినతిని అందజేశారు. ఆందోళనలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధికారి ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, జిల్లా కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి, రాష్ట్ర యూత్ కమిటీ కార్యదర్శి రఘురామ్, ఆయా మండలాల కన్వీనర్లు జి.భీమారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ప్రహ్లాదాచార్, బెట్టనగౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రీ సర్వేతో రైతుల భూ సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

గోనెగండ్ల : రైతుల ఎదుర్కొంటున్న భూ సమస్యలు రీ సర్వేతో పరిష్కారం అవుతాయని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా బుధవారం మండలంలోని గంజిహళ్లి, పెద్దనేలటూర్ గ్రామాల్లో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభకు ఆదోని సబ్ కలెక్టర్ హాజరై మాట్లాడారు. రైతుల భూ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో రీ సర్వే చేసేందుకు ముగ్గురు వీఆర్వోలు, ఐదుగురు సర్వేయర్లను నియమించడం జరిగిందన్నారు. రీ సర్వే ద్వారా భూ కొలతల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, ఆన్‌లైన్ అడంగల్ తదితర సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాస రాజు, తహసీల్దార్ కుమారస్వామి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ శిరీష, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రేషన్ పంపిణీపై నిర్లక్ష్యం వద్దు

65 సంవత్సరాలు పైబడిన వారికీ, దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని హెచ్. కై రవాడి గ్రామంలో 16వ రేషన్ షాపును సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. మండలంలో 65 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగులకు తక్కువ శాతంలో డోర్ డెలివరి చేయడంపై అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రేపటి లోగా వంద శాతం డోర్ డెలివరీ పూర్తి చేయాలని ఆదేశించారు.

గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించండి

నందవరం : వర్ష కాలం దృష్ట్యా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఎంపీడీఓ పుల్లయ్య పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూర్తి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..పల్లెల్లో అపరిశుభ్రత, తాగునీరు కలుషితమైతే రోగాలు ప్రబలుతాయని, అందుకు గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రత పాటించాలని సూచించారు. మురుగు కాలువలు, నీటి కుంటలు, కుళాయిల వద్ద శుభ్రత పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో హరిజన అనిల్ అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తూ పట్టుబడ్డాడని ఆదోని ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్ బుధవారం విలేకరులకు తెలిపారు. అతని వద్ద నుంచి మూడు కర్ణాటక మద్యం బాక్సులు స్వాధీనం చేసుకుని, అదే గ్రామానికి చెందిన మద్యం సరఫరాదారుడు నక్కల సురేష్‌పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

నాటుసారా స్థావరంపై దాడులు

ఆదోని రూరల్: మండలంలోని ఇస్వీ కొండ సమీపంలోని నాటుసారా స్థావరంపై దాడులు చేసినట్లు బుధవారం ఇస్వీ ఎస్ఐ డాక్టర్ నాయక్ బుధవారం తెలిపారు. ఈ దాడుల్లో సారా రవాణా చేస్తున్న ముద్దాయి ఆదోని పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన బోయ రామాంజనేయులు అని తెలిసిందన్నారు. అతని వద్ద రెండు తెల్లని క్యాన్లలో 20 లీటర్ల నాటుసారాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటుసారాకు ఉపయోగించే బెల్లం ఊటను పారబోసినట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి జైలుకు తరలిస్తామని చెప్పారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ రామయ్య, కానిస్టేబుళ్లు కిరణ్, సుదర్శన్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేద్దాం

ఆదోని రూరల్: ఈనెల 22వ తేదీన స్థానిక రెడ్డి కల్యాణ మండపంలో సీపీఐ 20వ జరిగే పట్టణ మండల మహాసభల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. సమావేశంలో నాయకులు షేక్షావలి, నాగరాజు, రాముడు, మదిరి ఎల్లప్ప, రామన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



సూగూరులో శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నందవరం : క్షయవ్యాధి(టీబీ) వ్యాధి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ రేవతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త్ అభియాన్‌లో భాగంగా టీబీ సూపర్‌వైజర్ చాంద్ బాషా ఆధ్వర్యంలో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..గళ్ల పరీక్షలు, ఎక్స్‌రే పరీక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చేస్తారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సుశీలబాయి, ఎంఎల్‌హెచ్‌పీ కళావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సూగూరులో టీబీ వైద్య శిబిరం

మంత్రాలయం రూరల్ : మండలంలోని కల్లుదేవకుంట పీహెచ్‌సీ పరిధిలోని సూగూరు గ్రామంలో బుధవారం క్షయ వ్యాధి శిబిరం ఏర్పాటు చేశారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ గోవిందమ్మ నేతృత్వంలో గ్రామంలో 104 వాహనంలో వైద్య పరీక్ష నిర్వహించారు. టీబీ వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి నివారణ మందులు అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూజర్ వైజర్ మాధవస్వామి, టీబీ వ్యాధి సూపర్ వైజర్ మల్లికార్జున, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఏఎన్ఎం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోండి


ఎమ్మిగనూరురూరల్/గోనెగండ్ల: బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ విజయభాస్కర్ సూచించారు. బుధవారం ఎమ్మిగనూరు పట్టణ, గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో పెద్దలు, ముస్లిం మత పెద్దలు, ఆయా సంఘాలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే ముందుగా పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు. అంతేగాని పూర్తి సమాచారం లేకుండా సామాజిక మధ్యామాల్లో వైరల్ చేసి గొడవలకు తావివ్వొద్దని సూచించారు. వాట్సాప్ గ్రూపులలో కులమతాలు, రెచ్చగొట్టె మేసేజ్‌లను ఎవరు కూడా పెట్టరాదన్నారు. వాట్సాప్ గ్రూపులో మేసేలు పెడితే పెట్టిన వ్యక్తి, అడ్మిన్‌లే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ శేషఫణి, టౌన్ సీఐ వి. శ్రీనివాసులు, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, గోనెగండ్ల ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



గోనెగండ్లలో పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

నందవరం : బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ప్రశాంతంగా జరుపుకోవాలని హెడ్ కానిస్టేబుల్స్ అశోక్‌కుమార్, కోందడ రామిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయా గ్రామాల ముస్లిం పెద్దలతో పీఎస్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ రాజు, నరేంద్ర, సమీర్ పాల్గొన్నారు.

పండుగ ప్రశాంతంగా జరుపుకోండి



మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

కౌతాళం: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలు వివిధ సంఘాల నాయకులతో పీస్ కమిటీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 7న బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీని బహిరంగ ప్రదేశాల్లో చేసుకోకూడదన్నారు. కౌతాళంలో ఖాదర్‌లింగస్వామి ఆశీర్వాదంతో అందరు కలిసి మెలసి సోదరభావంతో ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారని సర్పంచ్ పాల్‌దినకర్, విశ్వహిందు పరిషత్ జిల్లా కార్యదర్శి మారుతీమోహన్ అన్నారు. కార్యక్రమంలో పెద్దలు హఫీజ్ హుసేన్, లడ్డా ఖాదర్‌బాషా, వలిసాబ్, మహమ్మద్, అబ్దుల్ సమద్, ఇస్మాయిల్, గౌస్‌పీర్, అబ్దుల్‌షుకుర్, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు ఆనంద్, వీరభద్రశెట్టి పాల్గొన్నారు.

కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన దీక్షా శిబిరానికి బుధవారం ఆమె వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. కార్మికులకు పనికి తగ్గ వేతనం మంజూరు చేయాలని, అదేవిధంగా సంక్షేమ పథకాలు అమలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. 15 సంవత్సరాల పాటు విధులు నిర్వర్తించిన కార్మికులందరిని క్రమబద్ధీకరించాలని, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే ఉద్యోగులకు 62 ఏళ్లకు పదవీ విరమణ అయ్యేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. వారి న్యాయమైన ప్రతి కోర్కెను కూటమి ప్రభుత్వం పరిష్కరించి ప్రజల సేవలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్, పార్టీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ, వీరశైవ లింగాయత్ అధ్యక్షుడు రుద్రగౌడ్, మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, పార్టీ నాయకులు కామర్తి నాగేషప్ప, సునీల్‌కుమార్, కోటకొండ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

హిందూ కుల సంఘాలకు సహకరిస్తాం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఉన్న హిందూ శ్మశానవాటికలో అక్రమంగా రోడ్డు నిర్మిస్తున్న ప్రాంతాన్ని బుధవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక పరిశీలించారు. శ్మశానవాటికలో స్థలంలో రోడ్డు నిర్మించడంపై హిందూ సంఘాల నాయకులు ఆమెకు వివరించారు. దీనిపై స్పందించిన ఆమె 22 హిందూ కుల సంఘాలకు న్యాయం జరిగేలా తనవంతుగా కృషి చేస్తానని హామి ఇచ్చారు. అదేవిధంగా శ్మశాన వాటికకు చుట్టూ కంచె ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుట్టా శివనీలకంఠ, రాష్ట్ర యూత్ విభాగం ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతూల్, పట్టణ పార్టీ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, పార్టీ నాయకులు శివప్రసాద్, సునీల్‌కుమార్, కోటకొండ నరసింహులు, మహబుబ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

గోవులను వధిస్తే కేసులు

ఆదోని అర్బన్: ఈనెల 7వ తేదీన బక్రీద్ పండగ సందర్భంగా ఎవరైనా గోవులను వధిస్తే కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ పండగ సందర్భంగా ముస్లింలు గొర్రెలు, మేకలను వధించుకోవచ్చన్నారు. హిందువులు ఆరాధ్యంగా పూజించే గోవులను మాత్రం వధించరాన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే వధిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వధించిన గొర్రెలు, మేకల వ్యర్థాలను మున్సిపాలిటీ వారు అందించే గోనె సంచుల్లో నింపాలన్నారు.